# చిన్న...చిన్నగా ప్రేమించుటకు!!

-'ప్రతిమ'

"మావా, అయ్యగారు ఎక్కడికో ఎల్లాలంట. నిన్నొచ్చి కారుతీయమన్నారు. కాళ్లు కడుక్కొనిరా, తొరగా అన్నం తిని ఎల్దువుగానీ" తడిక తలుపు తోసుకొని లోపలి కొస్తూ చెప్పింది రత్తాలు.

"ఇప్పుడే గదే వొచ్చింది. మళ్లీ ఏటంట? ఇప్పుడు రావడానికి కుదరదని చెప్పిరా" ఓ వైపు షర్టు తొడుక్కొంటూనే విసుక్కొన్నాడు వెంకటేశం.


సత్తుపళ్ళెంలో అన్నం పెడుతున్నదల్లా ఒక్క క్షణం ఆగి, ఆశ్చర్యపోయింది రత్తాలు.

"ఏంది మావా, మహాజోరు మీదున్నావు! మనం ఆల్లకాడ నౌకరీ సేస్తండమా, ఆల్లు మన కాడసేస్తా్రనా? లేటవుద్ది, తొరగా ఎల్లు"

"ఆయనగారు తిన్నారా, అప్పుడే"

"అయ్యగారికి ఏదో పార్టీ వున్నాదని పోనొచ్చింది. అమ్మగార్ని తినేసేమని చెప్పి, కింద హాల్లో రెడీగా కూసున్నారు నీ కోసం. పాపం అమ్మగారు ముద్ద ముట్టుకోలేదు. చేసిన కూరలన్నీ మనకే ఇచ్చేసేరు. సాయంత్రం నా చేత తెప్పించుకొన్న పూలుగూడ నాకే ఇచ్చేసేరు, ఒక్కోసారి సుజాతమ్మగార్ని సూత్తావుంటే నాకు జాల్లేస్తది మావా" ఒళ్లోంచి మల్లెపూలదండ తీసి తలలో పెట్టుకొంటూ చెప్పింది రత్తాలు.

"అవునే, అమ్మగారు చదువుకొనే రోజుల్లో ఎల్లా వుండేవారు... పెళ్లయ్యాక పాపం ఎల్లా అయిపోతున్నారు.



నాకూ బాధగా వుంటాది. కానీ మన మేం చేయగలమే? అయితే, పార్టీ వుంటె లేటవుతది గానీ, నువ్వు పడుకో, ఇయ్యాల నాకు జాగారమే'' అంటూ బయటకొచ్చిన వాడు గిరిక్కున లోపలికెళ్లి, రత్తాల్ని వాటేసుకొని, పెదాన్నందుకోబాయాడు వెంకటేశం.

''ఏమైంది నీకియ్యాల, మాంచి తిమ్మిరి మీదు న్నావు, ఎల్లు మావా, కావాలంటే మువ్వొచ్చేదాకా మేలుకొని వుంటాలే... అబ్బ... నీకే సెప్పేది ఒదులు మావా'' అంటూ, అతను వెళ్లడం తనకీ ఇష్టం లేకున్నా, బలవంతంగా అతని చేతుల్లోంచి తప్పుకొంది రత్తాలు.

ఆ వేళప్పుడు పిలిపించిన అయ్యగారికి బుద్ధిలేదను కొంటూ, తన ఒంట్లో నరాలకు బుద్ధి చెప్పుకొంటూ, గ్యారేజిలోంచి కారు తీశాడు వెంకటేశం. అతని బాధ చూసి, చెయ్యి ఊపుతూ, ముసిముసిగా నవ్వుతూ లోపలికెళ్లి తలుపేసుకొంది రత్తాలు.

* * *

క్రింద కారు స్టార్టయిన శబ్దంవిని, గబగబా కిటికీ దగ్గరకొచ్చి, వెళ్తొన్న కారుని చూస్తూ అలాగే నిలబడి పోయింది సుజాత. బాధతో ఆమె గుండెలు బరు వెక్కాయి.

సుజాత లక్షల్లో పుట్టింది, లక్షల్లో పెరిగింది. ఒక్కతే కూతురవడంవల్ల ఏ రోజూ కన్నీటి కర్థం తెలియకుండా పువ్వుల్లోపెట్టి పెంచారు అమ్మా నాన్నా. ఆమెలాగ మరెవరు పెరిగివున్నా, చదువనేది వాళ్ల దరిదాపుల కొచ్చేది కాదు. కానీ సుజాత ఎంత సుఖంగా పెరిగినా మొదటి నుంచి చదువంటే నిర్లక్ష్యం చేయకుండా ఎమ్.ఏ. వరకూ చదివింది. జీవితం పట్ల నిర్దిష్టమైన అభిప్రాయాలున్న సుజాతంటే అందరూ అభిమానించే వారు. సురేష్ బాగా తగినవాడని ఏరి కోరి పెళ్లిచేశారు. సురేష్ అందగాడు, పైగా ఇంజనీర్. అతనితో జీవితం ఎంతో అందంగా వుంటుందని కన్నె కలలుకన్న సుజాత, పెళ్లయిన రెండేళ్లలోనే నిరాశనిట్టూర్పుల్లో తన జీవితం ఎడారిలాగ అయిపోతోందని విలవిల్లాడింది.

నెలలో దాదాపు ఎక్కువ రోజులు క్యాంపుల మీద తిరుగుతూ వుంటాడు సురేష్. ఊర్లోవుంటేవాలుగైదు రోజులు కూడా పార్టీలని, మీటింగులని కనీసం రాత్రిళ్లు కూడా ఇంట్లో వుండకపోవడంతో, ఎన్నో కన్నీటి రాత్రుల్ని గడిపింది. అసలు తనకు ఓ భార్య వుందనీ, ఆమెకూ కొన్ని కోరికలు వుంటాయని ఎప్పుడైనా అతనాలోచించాడా అని అనుమానం. ఆడపిల్లలు ఎంతో మధురంగా ఊహించుకొనే వివాహపు తొలి రోజులు తన జీవితంలో ఇంత పేలవంగా, సుఖానికి దూరమై ఇలా అడవి కాచిన వెన్నెల్లా ఎన్నాళ్లు? ఆమె మనసు బాధగా మూలిగింది. ఆలోచిస్తూ ఆకాశంలోకి చూస్తొంటే, తనని చూసి నక్షత్రాలన్నీ నవ్వుతున్నట్టు, వెన్నెల వెక్కిరిస్తున్నట్టనిపించి, కోపంగా కిటికీ తలుపులు మూసేసి, కళ్లు తడుచుకుంది సుజాత.

* * *


''హలో, వెల్‌కమ్ సురేష్'' అంటూ ఆనందంగా ఆహ్వానించారక్కడ వున్నవాళ్లంతా, అప్పటికే మత్తులో మునిగి తెలుతున్నారు వాళ్లు.

''ఐయామ్ సారీ, ఫ్రెండ్స్... కాస్త ఆలస్యమైంది'' అంటూ తనూ ఓ గ్లాసు అందుకొన్నాడు సురేష్.

వాళ్లంతా చాలా ఖరీదైన మనుషులు. పచ్చనోట్లు అంటే పచ్చగడ్డికన్నా తేలికైన భావం. వాళ్లలో నలుగురేమో కంట్రాక్టర్లు, మరో ఇద్దరేమో ఇంజనీర్లు. ఎవరికే క్రొత్త కంట్రాక్టు వచ్చినా దానికి మిగిలిన వాళ్ల చేయూత వుంటుంది కాబట్టి ఎవరి భాగాలు వాళ్లు పంచుకొని, ఇలా పార్టీ చేసుకోవడం పరిపాటే.

''నెవర్ మైండ్ బ్రదర్, పార్టీకి లేటయినా పర్వా లేదు. కానీ జీవితంలో మాత్రం లేటు కాకూడదెవ్వరూ. లేటయితే, తర్వాత బ్రతుకంతా లోటే'' అన్నారు వాళ్లలో ఒకరు.

''ఏవిటోయ్, ఈ రోజేదో వేదాంతం చెప్తున్నావు,




ఇదేమైనా దేవదాసు డ్రామా అనుకొన్నావా'' అని, అదేదో పెద్ద జోకైనట్టు పదే పదే నవ్వుతున్నాడా చెప్పినతను.

''అరే, వేదాంతం కాదు బ్రదర్ పచ్చినిజం'' అని ఆగి ఐస్ క్రిక్స్‌ని గ్లాసులో వేసుకొంటూ, మళ్లీ చెప్పాడు.

''మరేం లేదు, మన గుర్నాథంగారు లేరు, అదే... అశోకా హోటల్ ప్రొప్రయిటరు, వాళ్ళబ్బాయి కలకత్తాలోఅదేదో కంపెనీలోఇంజనీరుగా వుంటున్నాడు. ఆ మధ్యే పెళ్లయింది. అమ్మడు మంచి పర్సనాలిటీయే నంట. అయితే, ఇతగాడు ఎప్పుడూ క్యాంపులని ఊర్లు తిరుగుతూ వుంటాడంట. అది వీలుగా చేసుకొని, వాళ్లింట్లో డ్రైవర్ కుర్రాడు ఆ అమ్మాయిని వల్లో వేసుకొని, ఆ తర్వాత ఒళ్లో వేసుకొనీ... అలా హ్యాపీగా వుంటే ఓ రోజు అతగాడి కంటబడ్డారు. దాంతో తిక్కరేగి వాణ్ని తన్నబోతే, వాళ్లిద్దరూ కలిసి ఇతగాడి బుర్ర అతిసులువుగా పగులగొట్టి, పరారీ అయ్యారంట. చావుతప్పి కన్ను... కాదు, బుర్ర లొట్టపోయి, పాపం ఇతను ఆస్పత్రిలో వున్నాండ్ట'' అని ఇదంతా అతను ఏకధాటిగా చెప్పలేదు. అరగంటసేపు మాటల్ని మత్తులో ముంచి చెప్పిన 'పచ్చినిజం' సారాంశమిది.

అది విన్న తర్వాత వాళ్లంతా నవ్వుకొంటూ తమకు తెలిసిన వాళ్ల భార్యల గురించి, బూతు జోకులు వేసుకొని ఎంజాయిచేస్తూ, ఎవరికి వాళ్లు తమ పెళ్లాల పాతివ్రత్యాన్ని గురించి కథలు కథలుగా చెప్పుకొని తృప్తి పడ్డారు. ఒకరి మీద ఒకరు తూలిపడ్డారు.

సురేష్ మాత్రం ఏం మాట్లాడ్డంలేదు. గ్లాసు మీద గ్లాసు ఖాళీ చేస్తూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఒక్కోసారి పార్టీ పెద్దగా వుంటే, తను రాగానే వెంకటేశాన్ని పంపించేస్తాడు ఇంటిదగ్గర సేఫ్టీకోసం. ఈ రోజూ అలాగే తను రాగానే కారు పంపించేశాడు. అది మామూలుగా జరిగే విషయమే. కానీ, ఇవ్వేళ పార్టీలో వాళ్ల మధ్య జరిగిన సంభాషణ అతని గుండెల్లో తుఫాను రేపింది. ఏదో గుబులు పుట్టి, గ్లాసు గ్లాసుకీ అది ఒళ్లంతా పాకింది. ''తను క్యాంపు లెక్కువగా వెళ్తాడు. తనకూ పెళ్లయి రెండేళ్లే అయ్యింది. సుజాత అందంగా వుంటుంది. వెంకటేశం ముందునుంచి ఆమెని ఎరిగున్న వాడు. సుజాత వయసులో వుంది...'' అంతే, ఇక ఆలోచించలేకపోయాడు. అతనిలో నరాలన్నీ బిగుసుకు పోయాయి.

''నో, నాట్ లైక్ దట్'' అంటూ గట్టిగా అరిచి గ్లాసవతల పారేసి బాటిల్ అందుకొని ఒక్క గుక్కలో ఖాళీ చేశాడు. తాగిన కొద్దీ అతనిలో అనుమానం నిప్పులా రాజుకొంటోంది. మత్తులో అసలు నిలబడలేక పోతున్నాడు. అతని పరిస్థితి చూసి వాళ్లలో ఒకరు, తను సురేష్‌ని డ్రాప్ చేస్తానని మిగతా వాళ్ల దగ్గర సెలవు తీసుకొని బయలుదేరాడు.

* * *

ఆ వేళ సురేష్, ''నేను రావడం చాలా ఆలస్యమయ్యే టట్లుంది! నువ్వెళ్లిపో, వెంకటేశం! నేను ఎవరికార్లోనైనా వస్తాలే. ఇంటిదగ్గర జాగ్రత్త''అని చెప్పగానే, ఆనందంతో

ఒక్కసారి ఎగిరి గంతేసి హుషారుగా ఇంటికి బయలు దేరాడు వెంకటేశం. అతని కళ్లకు, తలలో మల్లెపూలు పెట్టుకొని, "ఎల్లిరా మావా, కావాలంటే నువ్వొచ్చేంత దాకా మేలుకొని వుంటాలే" అని మత్తుగా నవ్వుతున్న రత్తాలే కనబడుతోంది. ఒంట్లో వేడి పెరిగింది. అంతలో తను అంతకు ముందురోజు చూసిన సినిమాలో ఓ సంఘటన గుర్తొచ్చి, ఈ రోజు అదే మాదిరి తనూ రత్తాల్ని ఆట పట్టించాలనుకొన్నాడు. దారిలో పూలు కొనుక్కొన్నాడు. వాటిని కార్లో ఫ్రంట్ సీట్ పై ఎందర వందరగా వేశాడు. కొన్ని తల మీద వెంట్రుకల మధ్య వేసుకొన్నాడు. మెల్లగా ఈల వేసుకొంటు కారుని బంగళాలో తిన్నగా గ్యారేజిలోకి పోనివ్వకుండా, పాక ముందే ఆపాడు. కారు ఆగిన శబ్దం విని, జారుతున్న పూలతో, సగం జారిన పైటతో బయటకొచ్చి.

"ఏంటి మావా, అప్పుడే వొచ్చేసినావు. అయ్యగారు గూడా వొచ్చిర్రా లేకుంటే నిన్ను మాత్రం పంపి చేస్రా..." అంది రత్తాలు.

వెంకటేశం అదేం వినకుండా, "అది సర్లేగాని, ఇట్రాయే రత్తి" అన్నాడు. తను కారు దగ్గరకొస్తే, తన సీటుమీద, తలమీద పూలు చూసి రత్తాలు కోపాలు పోతే; ఆ తర్వాత నిజం చెప్పి ఆమె తాపాలు తీర్చాలని అతని ఉబలాటం.

కళ్లు నలుముకొంటూ దగ్గరికొచ్చింది రత్తాలు. కారులోపల చూసింది, పూలున్నాయి. అతని తలమీద పూలున్నాయి. అది చూసి గట్టిగా నవ్వింది రత్తాలు.

"ఏందయ్యో, ఇయ్యాల మంచి తిమ్మిరి మీదున్న ట్టున్నావు. పూలతోటే సరసమాడేసినట్టున్నావు"

వెంకటేశం ముఖం చిన్నబోయింది. రత్తాలు ఆ విషయం గురించి పట్టించుకోకుండా మామూలుగా మాట్లాడేస్తూంటే కాస్త తేరుకొని,

"అదికాదు రత్తీ! అయ్యగార్ని దింపేసివస్తోంటే దారిలో ఎవరో ఆడపిల్ల ఒంటరిగా నిలబడి లిఫ్ట్ అడిగింది. జాలేసి ఎక్కించుకొన్నాను. తీరా చూస్తే అదేదో కేసు. భయం లేకుండా నా పక్కనే కూర్చొని, ముద్దుపెట్టుకొని, నాపైన బడి... ఇంకా..." అని చెప్తూండగానే పడీ పడీ నవ్వింది రత్తాలు.

"మావా, ఎనకటి కెవడో నీలాటోడే ఎలకని చంపి ఆ నెత్తురు ఒంటికి పూసుకొని, పులిని చంపొచ్చానని డంబాలు పోయిండంట. లేకుంటే ఏంది మావా, అబద్ధం చెప్పినా ఎదటోల్లకది నమ్మేటట్టుగా వుండాలి. నీ బుద్ధి నాకు తెలవదా, యిన్నేళ్ళు నీతో కాపురం సేసినానే, నీ మనసెట్టాంటిదో నాకుతెలవదా, మావా" అని ఇంకా నవ్వుతోన్న రత్తాలుని చూస్తే, ఆమెకు తన మీద వున్న ప్రేమకు, నమ్మకానికీ చలించిపోయాడు వెంకటేశం. అమాయకంగా ఆమె నవ్వుతూ వుంటే మల్లె పూలు నవ్వినట్లే వుంది.

"రత్తీ, జన్మజన్మలకు నువ్వే నాకు భార్యగా పుట్టాలే" అన్నాడు కళ్లలో నీళ్లు తిరుగుతోంటే.

"అట్టాగేలే, పిచ్చి మావా" అని గోముగా నవ్వి, మళ్లీ,

"ఇందాక అమ్మగారికి తల నొప్పిగా వుందంటే ఎల్లి అమురుతాంజనం రాసొచ్చాను గాని, కారు షెడ్డులో పెట్టి తాళం చెవులిచ్చేప్పుడో సారి ఎట్టా వుందో సూసిరా మావా" అంది.

సరేనంటూ చెప్పి కారు గ్యారేజిలో పెట్టి తాళాలి చ్చేందుకు ఇంట్లోకెళ్లిన వెంకటేశం, సుజాత క్రింద హాల్లోనే కూర్చొని వుండడం చూసి,

"ఏటమ్మగోరు ఇక్కడ కూర్చున్నారు, ఇంకా నిద్రపోలేదా? తలనొప్పి అన్నారంట ఇప్పుడెట్లాగుంది, తగ్గిందా?" అనడిగాడు.

"ఏం లేదులే వెంకటేశం, నిద్రరాకుంటే ఇలా వచ్చి కూర్చొన్నాను. రత్తివచ్చి అమృతాంజనం రాసి వెళ్లింది. అయినా తలనొప్పి తగ్గలేదు. చాల నిసుగ్గా వుంది. అన్నట్టు అయ్యగారు రాలేదా?" అంది సుజాత.

"వన్నెల్లి పొమ్మన్నారమ్మా. బాబుగారు తర్వాత వస్తానన్నారు."

"సరే, అలా కూర్చొని కాసేపు కబుర్లు చెప్పు వెంకటేశం" అంది.

పెళ్ళికాక ముందు సుజాత కోసమే ఆ కారు కాబట్టి వెంకటేశం ఎప్పుడూ ఆమెతోనే వుండేవాడు. పెళ్లయ్యాక కారుతోపాటు డ్రైవర్‌గా వెంకటేశాన్నే పంపించారు సుజాత నాన్నగారు; అతనైతే ముందు

నుంచీ తమ దగ్గర వున్నవాడు కాబట్టి స్వంతవాడిలా అమ్మాయిని కనిపెట్టుకొని వుంటాడని ఆయన ఆశ. ఆ విషయం వెంకటేశానికి తెలుసు. అదీగాక సుజాత చదువుకొనే రోజుల్లో ఎప్పుడైనా ఒంట్లో నలతగా వుంటే తను దగ్గరుండి బాగా కబుర్లు చెప్పి, ఆమెకు ఆనందం కలుగచేసేవాడు.


అందుకే వెంటనే వెళ్లిపోకుండా అక్కడే సోఫా కెదురుగా క్రింద కూర్చొని,

"మొన్న బజార్లో మీ ఫ్రెండ్, బాపిగారు కనిపించా రమ్మా" అంటూ మెల్లగా కబుర్లలోకి దిగాడు. అలా పాత రోజుల గురించి అనుకుంటూ, వెంకటేశం అమాయకంగాఏవేవో అడుగుతోంటేనవ్వేస్తూ రిలాక్స్ కావడానికి ప్రయత్నిస్తోంది సుజాత, సురేష్ కోసం ఎదురుచూస్తూ.

* * *

"సురేష్,ఏమయ్యింది, ఎందుకలా సడన్‌గా ఎక్సైట్ అయ్యారు" కార్లో అడిగాడతను.

సురేష్ మాట్లాడలేదు. ఒళ్లు తూలిపోతుంటే ఉద్వేగంతో రొప్పుతున్నాడు. అతను మళ్లీ ఏదో అడిగేంతలో కారు ఇంటిదగ్గర కొచ్చి పోర్టికోలో ఆగింది. సురేష్ నడవలేడని మెల్లగా సురేష్‌ని పట్టుకొని గుమ్మందాకా తీసుకువచ్చిన అతను, లోపల హాల్లో సుజాత, వెంకటేశం హాయిగా కబుర్లు చెప్పుకొంటూ నవ్వేసుకొంటూంటే, ఒక్క క్షణం వాళ్లిద్దర్నీ మార్చి మార్చి చూసి, అంతలో ఏదో రహస్యం కనుకొన్నట్లుగా,




"నాకర్థమైంది, మీ రెందుకు అంతగా ఎక్సైట్ అయ్యారో" వెకిలిగానవ్వుతూ సురేష్‌ని వదలి వెనక్కి తిరిగి బయటికి నడిచాడు అతను.

అంతలో వెనకనుంచి, "యూ బిచ్" అని సురేష్ అరవడం... కాస్సేపు నిశ్శబ్దం, మళ్లీ వెంటనే సురేష్ గొంతు.

"ఏరా, ఇడియట్! ఎంత ధైర్యంరా నీకు" అంటూ విరుచుకుపడ్డం, వెంటనే ఏవో వస్తువులు క్రిందపడ్డ శబ్దం ఆ వెంటనే,

"అయ్యగారూ, ఏమైంది సుజాతమ్మగారూ... బాబుగారూ, ఏం జరిగింది... అమ్మా... అబ్బా..." అన్న ఆక్రందనా, అన్నీ అతనికి వినబడుతూనే వున్నా, వెనక్కి తిరిగి చూడలేదు. అక్కడేం జరుగుతోందో తెలుసు... ఈ విషయాన్ని ఈసారి పార్టీలో చెప్పాలా, వద్దా అని ఆలోచిస్తోంది అతని మనసు!!